# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha @TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 1 pm

సోమవారం 14-8-2023




## చిరుత చిక్కింది

– అలిపిరి పరిసరాల్లో మరో 5 చిరుతలు

– భక్తులకు భద్రతచర్యలపై నేడు ఉన్నతాధికారుల సమీక్ష

**తిరుపతి, ఆగస్ట్14(తెలుగుప్రభ):**

ఎట్టకేలకు చిరుత చిక్కింది.అటవీ అధికారుల బోనులో పడింది.ఇటీవల నెల్లూరు జిల్లాకు చెందిన లక్షిత అనే చిన్నారిపై చిరుత దాడి చేయగా మృతి చెందడం తెలిసిందే. చిరుతను పట్టుకునేందుకు అటవీశాఖ అధికారులు దాడి జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలతోపాటు మూడు బోన్లు ఏర్పాటు చేశారు. సోమవారం తెల్లవారు జామున వాటిల్లోని ఒక బోనులో చిరుత చిక్కినట్లు అధికారులు పేర్కొన్నారు.గతంలో కూడా ఓ చిన్నారిపై చిరుత దాడి చేయగా బంధించి కళ్యాణ్‌డ్యామ్‌కు సమీపంలోని అడవిలో విడిచిపెట్టారు. ప్రస్తుతం చిక్కిన చిరుతను తిరుపతి ఎస్వీ జూపార్కుకు తరలించనున్నట్లు టీటీడీ ఈఓ ధర్మారెడ్డి తెలిపారు. స్వల్పంగా గాయపడ్డ చిరుతకు అక్కడ చికిత్స అందించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం దాన్ని ఎక్కడ విడిచిపెట్టాలనే దానిపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

### అంతలోనే మరో చిరుత

చిరుత చిక్కిందని ఊపిరి పీల్చుకున్న తరుణంలోనే మరో చిరుత కనిపించిందనే సమాచారంతో టీటీడీ వర్గాల్లో మళ్లీ టెన్షన్ మొదలైంది.అలిపిరి నడక మార్గంలో నామాలగువి ప్రాంతంలో వెళ్తున్న భక్తులకు చిరుత కనిపించడంతో వారు భయాందోళనలతకు గట్టిగా కేకలు వేసి పరుగులు పెట్టారు. దీంతో చిరుత అక్కడినుంచి పారిపోయింది. ఇదిలా ఉండగా, అలిపిరి కాలినడక మార్గాల్లో మరో ఐదు చిరుతలు సంచరిస్తున్నట్లు ట్రాప్ కెమెరాల్లో దృశ్యాలు నమోదయ్యాయని అధికారులు తెఇపారు.ఈ నేపథ్యంలో భక్తులకు కల్పించాల్సిన భద్రతచర్యలపై ఈ మధ్యాహ్నం 3 గంటలకు ఉన్నతాధికారులు సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నారు.



## జింక మాంసం విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

**హైదరాబాద్, ఆగస్ట్14(తెలుగుప్రభ):**

నగర శివార్లలో జింక,దుప్పి మాంసాన్ని విక్రయిస్తున్న ముఠాను ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. ఆర్జీఐ పీఎస పరిధిలోని గగన్‌పహాడ్‌లో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించినవివరాలిలా ఉన్నాయ. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణగౌడ్ తెలిపిన సమాచారం మేరకు, వన్యప్రాణులైన జింక,దుప్పి మాంసాన్ని అక్రమంగా విక్రయిస్తున్నారని అందిన సమాచారంతో ఇవాళ తెల్లవారుజామున ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. జింక,దుప్పి మాంసాన్ని విక్రయిస్తున్న రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం సరస్వతిపురం గ్రామానికి చెందిన వెంకటేశ్, కందుకూరు మండలం లేమూరుకు చెందిన కరుణాకర్‌తో పాటు నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలానికి చెందిన శ్రీనులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 16 కేజీల జింక, దుప్పి మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. రెండు బైక్‌లు సీజ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



## అన్నవరంలో ప్లాస్టిక్ నిషేధం

రేపట్నుంచి అమలు

**కాకినాడ, ఆగస్ట్14(తెలుగుప్రభ):**

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం కొండపై రేపట్నుంచి ప్లాస్టిక్ నిషేధం అమలు చేయనున్నారు. పర్యావరణ పరిరక్షణతోపాటు పుణ్యక్షేత్రం పరిశుభ్రంగా ఉండేందుకు ఈ చర్యలు అమలు చేస్తున్నట్లు ఆలయ ఈఓ ఆజాద్‌పేర్కొన్నారు. అతిక్రమించిన వారికి రూ.500 జరిమానా విధించనున్నట్లు తెలిపారు.



# జెండా ఎత్తేద్దాం!

## అధికారం లేకుంటే అంతే సంగతులు.. మూణ్నాళ్లకే మూతపడ్డ పార్టీలు

హైదరాబాద్, ఆగస్ట్ 14(తెలుగుప్రభ):

వైఎస్ షర్మిల తన వైఎస్సార్‌టీపీని కాంగ్రెస్‌లో విలీనం చేయడం కేవలం ఇక లాంఛనప్రాయమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్న తరుణంలో రాజకీయ పార్టీల పుట్టుక, మనుగడ ప్రస్తుతం చర్చకొస్తున్నాయి. మన దేశంలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఏదో ఒక రాజకీయాపార్టీలోనో, సినీరంగంలోనో, ఇతరత్రా రంగాల్లోనో ఒక వెలుగు వెలిగిన వారు సొంతపార్టీలు పెట్టుకోవడం.. కొంతకాలానికే వాటిని నడిపించలేకో, వెంట వచ్చేవారు లేకో మూసివేయడం ఎంతో కాలంగా జరుగుతోంది.


సినీరంగంలో హీరోగా నటించడం వల్ల పెరిగిన ప్రజాభిమానంతో రాజకీయాల్లోనూ రాణించి ముఖ్యమంత్రులుగా ఎదిగిన నందమూరి తారకరామారావు, ఎంజీ రామచంద్రన్‌లతోపాటు తిరుచ్చి తలైవి జయలలిత వంటి వాళ్లు ఉన్నప్పటికీ, రాణించలేకపోయిన వారే ఎక్కువగా కనిపిస్తారు. గతంలోని రాజకీయాలకు,ఇప్పటి రాజకీయాలకు ఎంతో తేడా ఉండటం ఇందుకు ఒక కారణం. ప్రస్తుతం కనీసం ఎమ్మెల్యే సీటుకు పోటీ చేయాలంటేనే కోట్లకొద్దీ డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇక సొంతపార్టీని నడపాలంటే కనీసంగా వందల కోట్లు కావాలి. అంతేకాదు.. ప్రలోభాలతో ఏరోజు ఏ పార్టీలోకి దూకుతారో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రాజకీయపార్టీని పెట్టి మనుగడ సాగించాలంటే వందలాది కోట్ల డబ్బు మాత్రమే కాక ఇతరత్రా అంశాలూ ముఖ్యభూమిక వహిస్తాయి.

### తెలంగాణ పేరిట పుట్టినవెన్నో

తెలంగాణ పేరిట పుట్టిన పార్టీలు ఎన్నెన్నో ఉన్నాయి. వాటిల్లో చాలా పార్టీలు బతికి బట్టకట్టలేక పోయాయి. ఉన్న పార్టీలో తగినగుర్తింపు లేకపోవడంతోనో, అధికారం లభించలేదనో సొంతకుంపట్లు పెట్టుకున్న వారెందరో ఉన్నారు. అనంతరం తత్వం బోధపడి జెండా ఎత్తేసిన వాళ్లూ, తమ పార్టీని ఇతర పార్టీల్లో విలీనం చేసిన వారూ ఉన్నారు. తెలంగాణ పేరిట పుట్టిన పార్టీలతో పాటు అప్పటికే ఒక పార్టీ ఉన్నందున అందులో తెలంగాణను చేర్చడం ద్వారా వేరే పార్టీలు పెట్టుకున్న వారూ ఉన్నారు. వాటిని ఓమారు అవలోకిస్తే మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ప్రజాసమితి, టి.వెంకటస్వామి తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ,ఆలె నరేంద్ర తెలంగాణ సాధన సమితి, దేవేందర్ గౌడ్ నవతెలంగాణ, విజయశాంతి తల్లి తెలంగాణ, చెరుకు సుధాకర్ తెలంగాణ ఇంటిపార్టీ,జిట్టా బాలకృష్ణారెడ్డి యువ తెలంగాణతోపాటు తదితరమైనవి ఉన్నాయి. తమ ఇమేజ్, తమ ప్రాముఖ్యత, కులబలం వంటివాటి తో పార్టీలు నడపగలమని భావించిన వారూ ఉన్నారు. అలాంటి వాటిల్లో కాసు బ్రహ్మానందరెడ్డి రెడ్డి కాంగ్రెస్,నాదెండ్ల భాస్కరరావు ప్రజాస్వామ్య తెలుగుదేశం, లక్ష్మీ పార్వతి ఎన్టీఆర్ తెలుగుదేశం,హరికృష్ణ అన్న తెలుగుదేశం,కాసాని జ్ఞానేశ్వర్ మన పార్టీ తదితరమైనవి ఉన్నాయి. తదనంతరం ఇవన్నీ తెరమరుగు కావడం తెలిసిందే. ఒక ప్రాంతం కోసమో, ఒక లక్ష్యం కోసమో, సామాజిక నేపథ్యంలోనో పుట్టిన పార్టీలూ ఉన్నాయి. అలాంటి వాటిల్లో కోదండరామ్ తెలంగాణ జనసమితి, తెలంగాణ ప్రజాసమితి, తెలంగాణ రాష్ట్రసాధన ఫ్రంట్.. తదితరమైనవి కనిపిస్తాయి.

### రాజకీయం తెలియక, రాజీ పడలేక

రాజకీయం తెలియక,రాజీ పడలేక పార్టీలను మూసేసిన వాళ్లూ కనిపిస్తారు. మెగాస్టార్ చిరంజీవి ఇందుకు ఒక ఉదాహరణ. ప్రజాబలం ఉన్నప్పటికీ, గణనీయమైన సీట్లు గెలిచినప్పటికీ ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయడం తెలిసిందే. తగిన ధనం లేక, అటు గెలవలేక ఇటు పార్టీని మూసేయలేక కిందా మీదా పడుతూ నెట్టుకొస్తున్నవారూ కనిపిస్తారు. పార్టీ పేరిట ఒకటీ అరా సీట్లు పొందుతూ బతుకుతున్న పార్టీలూ అక్కడక్కడా కనిపిస్తాయి. ప్రజల కోసం పనిచేసే అలాంటి పార్టీలు బతుకుతున్నప్పటికీ, అధికారం కోసమో, అందలాల కోసమో పార్టీలు పెట్టుకున్న వాళ్లు మాత్రం ఇతర పార్టీల్లో విలీనం చేసిన దృశ్యాలే కనిపిస్తాయి.



### నిలిచి గెలిచిన ఎన్టీఆర్, కేసీఆర్

పట్టు పట్టనే కూడదు.. పడితే విడవకూడదు అన్నట్లుగా విజయం సాధించిన వారిలో నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్, నేటి ముఖ్యమంత్రి కేసీఆర్ కనిపిస్తారు. ఎన్టీఆర్‌కు నెలల వ్యవధిలోనే లక్ష్యం నెరవేరగా, కేసీఆర్ లక్ష్య సాధన తెలంగాణ ఏర్పాటుకు మాత్రం దాదాపు దశాబ్దానికి పైగా పట్టింది.

## రైళ్లలో దొంగలు పడ్డారు

**హైదరాబాద్, ఆగస్ట్14(తెలుగుప్రభ):**

నగరం నుండి బయలుదేరిన రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో దొంగలు పడ్డారు. సికింద్రాబాద్ నుంచి చెన్నయ్ బయల్దేరిన హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో ఆరు బోగీల్లో దొంగలు పడి ప్రయాణికుల నుంచి నగదు దోచుకెళ్లినట్లు తెలిసింది. సికింద్రాబాద్ నుంచే బయల్దేరిన తాంబరం వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైల్లోని రెండు బోగీల్లో దొంగలు బీభత్సం సృష్టించినట్లు రైల్వే వర్గాల ద్వారా తెలిసింది. అర్ధరాత్రి దాటాక 1.20 –1.50 గంటల మధ్య సమయాల్లో ఈ దొంగతనాలు జరిగినట్లు సమాచారం. రైళ్లలో దొంగలు పడ్డ విషయాన్ని ప్రయాణికులు తెట్టు, కావలిలలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నించగా,దుండగులు రాళ్లు విసిరి పరారైనట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



## 24 గంటలు.. 18 మంది మృతి

**ముంబై, ఆగస్ట్14:**

మహారాష్ట్రలోని థానే జిల్లా కాల్వా పట్టణంలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆస్పత్రిలో 24 గంటల వ్యవధిలో 18 మంది మృతి చెందడం తీవ్ర కలకలం రేపింది. మరణించిన వారిలో పదిమంది పురుషులు కాగా మహిళలు ఎనమిదిమంది ఉన్నారు. పక్షవాతం, మూత్రపిండాల్లో రాళ్లు,అల్సర్,న్యుమోనియా తదితర వ్యాధులకు చికిత్స పొందుతున్న వారిలో ఒకేరోజు ఇంతమంది మృతి చెందడం ఆస్పత్రి వర్గాలను కలచి వేసింది. ఇంతకీ వారి మరణానికి కారణం వారికున్న వ్యాధులేనా, లేక ఇతరత్రా కారణాలేమైనా ఉన్నాయా అన్నది తెలియరాలేదు. విషయం తెలిసి ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తీవ్ర దిగ్భ్రంతి వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆరోగ్యసేవల కమిషనర్ నేతృత్వంలో స్వతంత్రకమిటీని ఏర్పాటు చేసి విచారణ జరపాల్సిందిగా ఆదేశించారు. ఆస్పత్రి సామర్థ్యానికి మించి రోగులున్నందునే వారికి సకాలంలో,సరైన వైద్యం అందడం లేదని థానే మాజీ మేయర్ నరేశ్ మాక్సే అభిప్రాయపడ్డారు.



## 70 అడుగుల గోతిలో చిక్కుకున్న కార్మికుడు

**చండీగఢ్, ఆగస్ట్ 14:**

ఢిల్లీనుంచి జమ్మూలోని కటాడా వరకు ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణ పనుల్లో భాగంగా తవ్విన భారీ గోతిలో కార్మికులు ఇరుక్కుపోయాడు. జలంధర్‌జిలాల కర్తార్‌పుర్ సమీపంలో ఈ సంఘటన జరిగింది. భారీ పిల్లర్ కోసం పెద్ద గొయ్యి తవ్వారు. గొయ్యిలోపల బోరింగ్ మెషిన్‌లో సమస్య ఎదురవడంతో ఇద్దరుకార్మికులను గొయ్యిలోపలకు దింపారు. పైనుంచి ఇసుక రాలి పడుతుండటం గమనించిన పవన్ అనే కార్మికుడు వెంటనే పైకి రాగా, సురేష్(55) అనే మరో కార్మికుడు మాత్రం 70 అడుగుల లోతులో గొయ్యిలో ఇరుక్కు పోయాడు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయకచర్యలు చేపట్టాయి.



## రైలు పట్టాలు దాటుతూ దంపతులు మృతి

**అనంతపురం, ఆగస్ట్14(తెలుగుప్రభ):**

రైలును చూసుకోకుండా రైలుపట్టాలు దాటుతుండగా దంపతులు మృతి చెందిన విషాధ సంఘటన ధర్మవరంలో చోటు చేసుకుంది. శ్రీరాములు(60) రాములమ్మ(55) దంపతులు పట్టాలు దాటుతుండగా వేగంగా వచ్చిన రైలు వారిని ఢీకొన్నట్లు ప్రత్యక్షసాక్షులు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.